చీర్యాల స్వామిసేవలో మాజీ కలెక్టర్ ఎంవీరెడ్డి



కీసర: శ్రీ చీర్యాల లక్ష్మీ నృసింహ స్వామి సేవలో సోమవారం మేడ్చల్‌జిల్లా మాజీ కలెక్టర్ ఎంవీరెడ్డి కుటుంబసమేతంగా పాల్గొన్నారు. ఎంవీరెడ్డికి ఆలయ వేదపండితులు పూర్ణకుంభస్వాగతం పలికారు. ప్రత్యేకపూజల అనంతరం వేదపండితులు స్వామివారి ఆశీర్వచనంతోపాటు, మహాప్రసాదాన్ని అందజేశారు.

డ్రైనేజీ పనుల్లో నాణ్యత లోపించొద్దు



డ్రైనేజీ పనులు పర్యవేక్షిస్తున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: డ్రైనేజీ పనుల్లో నాణ్యత లోపించొద్దని మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య అన్నారు. మున్సిపాలిటీలోని నాలుగో వార్డు మారుతీనగర్‌లో రూ. 10 లక్షలతో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ మురుగునీరు రోడ్లపై ప్రవహించకుండా చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిలర్లు ఆంజనేయులుగౌడ్, కోఆప్షన్ సభ్యుడు షౌకత్, స్థానికులు పాల్గొన్నారు.

ప్రతి నెలా నిర్వహణ చార్జీలు చెల్లించాలి



మాట్లాడుతున్న కాలనీ అధ్యక్షుడు పార్థీవరెడ్డి

ఘట్‌కేసర్: కాలనీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని చౌదరిగూడ వెంకటసాయి నగర్ ఎకో ఫ్రెండ్లీ టౌన్‌షిప్–1 అధ్యక్షుడు గుర్రాల పార్థీవరెడ్డి అన్నారు. చౌదరిగూడ వెంకటసాయి నగర్ ఎకోఫ్రెండ్లీ టౌన్‌షిప్–1లో కాలనీ అభివృద్ధిపై సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించి పలు తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో శాంతి భద్రతల కాపాడడానికి సీసీ కెమరాల ఏర్పాట్లు, కాలనీలోని కోతులను తరిమేయడానికి, సీసీ రోడ్లు నిర్మాణంతో పాటు ఇతర మౌళిక సదుపాయాల ఏర్పాటుకు ప్రతి నెల నిర్వాహణ చార్జీలు చెల్లించాలని అన్నారు. కార్యక్రమంలో కాలనీ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

నకిలీ పత్రాలతో అద్దెకు

పోలీసులకు ఫిర్యాదు చేసిన టీఎన్జీఓఎస్ నేతలు



తప్పుడు పత్రాలు సృష్టించి నాగరాజుగౌడ్

మేడ్చల్ రూరల్: తప్పుడు అగ్రిమెంట్ పత్రాలు, ఫోర్జరీ సంతకాలతో మేడ్చల్ పట్టణంలోని టీఎన్జీఓఎస్ భవనాన్ని అద్దెకు తీసుకున్నట్లు మద్యం దుకాణం లైసెన్స్ పొందిన ఇద్దరిని మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ మురళీధర్ తెలిపిన మేరకు.. మేడ్చల్ పట్టణంలో గల టీఎన్జీవోస్ భవనాన్ని 2021 నవంబర్ నెలలో మేడ్చల్ పట్టణంలోని వెంకట్రామయ్య కాలనీలో నివాసం ఉండే నాగరాజుగౌడ్, కర్నూలుకు చెందిన పరమేశ్వర్‌రెడ్డి అనే వ్యక్తులు అద్దెకు తీసుకున్నారు. అందులో మద్యం దుకాణం నిర్వహించేందుకు నాగరాజుగౌడ్ ఆ భవన యజమాని అన్నట్లుగా తప్పుడు పత్రాలు రూపొందించి సాయి మహేశ్వరీ పేరుతో మద్యం దుకాణం నిర్వహించేందుకు పరమేశ్వర్‌రెడ్డికి అద్దెకు ఇస్తున్నట్లు తప్పుడు పత్రాలు సృష్టించాడు. పరమేశ్వర్‌రెడ్డి ఆ పత్రాలను జిల్లా ఎక్సైజ్ అధికారులకు చూపి మద్యం దుకాణం లైసెన్సులు పొందాడు. 2023 నవంబర్ తో భవనం అగ్రిమెంట్ పూర్తవ్వగా నాగరాజుగౌడ్, పరమేశ్వర్‌రెడ్డి అద్దె చెల్లించకుండా, భవనాన్ని ఖాళీ చేయకపోవడంతో మేడ్చల్ జిల్లా టీఎన్జీవోస్ సంఘం సభ్యులు మేడ్చల్ పోలీసులను ఆశ్రయించారు. తప్పుడు అగ్రిమెంట్ సృష్టించి మద్యం దుకాణ అనుమతులు పొందారని, తమ సంతకాలను ఫోర్జరీ చేశారన్న విషయం తెలుసుకున్న టీఎన్జీవోస్ నేతలు వారిపై చర్యలు తీసుకోవాలని మేడ్చల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు రవిప్రకాశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసిన పోలీసులు ఈ మేరకు నాగరాజు గౌడ్, పరమేశ్వర్‌రెడ్డిలపై కేసు నమోదు చేశారు.

భారత్ సంకల్పయాత్ర



ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, తదితరులు

ఘట్‌కేసర్: ప్రతి ఒక్కరూ ఒకే విధంగా బతకాలనేదే భారత్ వికాస్ సంకల్పయాత్ర లక్ష్యమని ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించిన వికాసిత్ భారత్ సంకల్పయాత్ర సోమవారం మండల పరిధిలోని కొర్రెముల్, ప్రతాపసింగారం గ్రామాలలో యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ... భారతదేశంలోని నిరుపేదలకు, రైతులకు, అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరేలా ప్రధానమంత్రి నరేంద్రమోదీ పథకాలను ప్రవేశపెట్టారన్నారు.

అయ్యప్ప భక్తుల అన్నదానానికి విరాళం



మేడ్చల్: పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో భక్తులకు నిర్వహించే అన్నదానానికి భక్తులు నారెడ్డి శ్రీధర్ రెడ్డి, శంకర్ ముదిరాజ్‌లు బియ్యం, పప్పులు విరాళంగా అందజేశారు. శ్రీధర్‌రెడ్డి 21 క్వింటాళ్ళ బియ్యం విరాళంగా ఇవ్వగా శంకర్‌ముదిరాజ్ క్వింటాళ్ కంది పప్పు, వంట నూనెను రవికిశోర్ అన్నదానం నిర్వహించే కౌన్సిలర్ నర్సింహ్మాస్వామి యాదవ్ అందజేశారు.

ఘనంగా అయ్యప్ప పూజ

మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లి శివాలయంలో భక్తులు అయ్యప్ప మహాపడిపూజను ఘనంగా నిర్వహించారు. అభిషేకాలు చేసి భజనలతో కీర్తించి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి పూజను చేశారు. పూజలో నాయకులు నందారెడ్డి, జగన్‌గౌడ్, రామకృష్ణ రాజు, శ్రీధర్‌రెడ్డి, నిఖిల్ సత్య,దేవ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

పురపాలికల్లో పన్నుల వసూళ్లపై దృష్టి

- స్పెషల్ డ్రైవ్‌లో ఇంటింటికీ ప్రత్యేక బృందాలు
- మార్చి 31 వరకు వంద శాతం పన్నుల వసూళ్లపై కార్యాచరణ
- గడువు లోగా పన్నులు చెల్లిస్తే వడ్డీ మినహాయింపు
- సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలంటున్న పురపాలికలు



సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో పురపాలక సంఘాలు పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టిసారించాయి. వంద శాతం పన్నులను రాబట్టటమే లక్ష్యంగా విశ్వప్రయత్నం చేస్తున్నాయి. వచ్చే ఏడాది మార్చితో ఆర్థిక సంవత్సరం ముగియనుంది. ఈలోపు లక్ష్యాన్ని చేరుకునేందుకు అధికారులు తగిన కార్యాచరణతో చర్యలు చేపడుతున్నారు. ఇందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించి ప్రతీ రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇంటింటికీ వెళ్లి పన్ను వసూలు చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల కారణంగా దాదాపు మూడు నెలలు వసూళ్లు మందగించాయి. ఇంకా మూడునెలల సమయమే మిగిలి ఉండటంతో ఈలోపు లక్ష్యం చేరుకునేందుకు శతవిధాలా కృషి చేస్తున్నారు.

పన్నుల వసూలు ఇలా..

జిల్లాలో నిజాంపేట, పీర్జాదిగూడ,బోడుప్పల్,జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్లతోపాటు మేడ్చల్,ఘట్కేసర్,పోచారం,తూముకుంట,నాగారం,గుండ్లపోచంపల్లి,దమ్మాయిగూడ,దుండిగల్,కొంపెల్లి మున్సిపాలిటీలు ఉన్నాయి.ఈ 13 పురపాలక సంఘాల్లో పన్నుల వసూళ్లు మొత్తం రూ.190 కోట్లు లక్ష్యంగా కాగా, ఇప్పటి వరకు రూ. 59 శాతం మాత్రమే పన్నులు వసూలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల కారణంగా పురపాలక యంత్రాంగం దాదాపు మూడు నెలల పాటు పన్నుల వసూళ్లకు ఫుల్ స్టాప్ పెట్టినట్లు తెలుస్తోంది. వచ్చే ఏడాది మార్చి 31తో ఆర్థిక సంవత్సరం ముగుస్తోంది. ఆలోగా చెల్లిస్తే వడ్డీ ఉండదు. తర్వాత రెండు శాతం చొప్పున పన్నుపై వడ్డీ విధిస్తారు. గతేడాది ఎర్లీబర్డ్ పథకం కింద ముందుస్తుగా చెల్లించిన వారికి 5 శాతం రాయితీ అవకాశమిచ్చినా... పెద్దగా స్పందన రాలేదు. గతేడాది ఒకటి,రెండు మినహాయించి మిగతా పురపాలికల్లో వంద శాతం పన్నులు వసూలు చేయలేదు. ఈ సారైనా లక్ష్యం చేరుకునేందుకు ప్రత్యేక బృందాలు ప్రయత్నాలు మొదలుపెట్టాయి. ప్రైవేట్ ఆస్తుల పన్నులు సకాలంలో వసూలవుతున్నా ...ప్రభుత్వ ఆస్తులకు సంబంధించిన పన్నులు మాత్రం ఏటేటా బకాయిలు పెరిగిపోతున్నాయి.

బకాయిలు పెరగడంతో ఇబ్బందులు

పురపాలికల్లో ఏటా సకాలంలో పన్నులు వసూలు కావటం లేదు. రూ. కోట్లల్లో బకాయిలు పేరుకుపోతుండటంతో అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతోంది. దీనికితోడు సిబ్బంది జీతభత్యాలు సకాలంలో ఇవ్వని దుస్థితి నెలకొంటోంది. ప్రతినెలా 10లోపు సిబ్బందికి వేతనాలు అందుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల నుంచి అధిగమించాలంటే పన్నులు సకాలంలో పన్నులు వసూలు కావాల్సి ఉంది.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి



అవుషాపూర్‌లో సర్పంచ్ కావేరిమశ్చేందర్‌రెడ్డి కిస్టియన్లు

కీసర: నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీలతో పాటు, మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని ప్రగతినగర్‌లో దయానంద్ ఆద్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మున్సిపల్ చైర్మెన్లు కౌకుట్లచంద్రారెడ్డి, వసుపతిప్రణీతాగౌడ్, వైస్ చైర్మెన్లు బండారి మల్లేష్ యాదవ్, మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మేడ్చల్: క్రిస్మస్ పండగను మేడ్చల్‌లో సోమవారం ఘనంగా జరుపుకున్నారు. చర్చిలలో ఆదివారం అర్ధరాత్రి దాటాక, బుధవారం ఉదయం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అందంగా అలంకరించిన చర్చిలలో చర్చి ఫాదర్లు, పాస్టర్లు క్రిస్మస్ సందేశాన్ని ఇచ్చారు. మేడ్చల్ పట్టణంతో పాటు, గౌడవెళ్ళి, బాసిరేగడి, జ్ఞానాపూర్, అత్వెల్లి , కండ్లకోయ తదితర ప్రాంతాల్లో పండగను ఘనంగా నిర్వహించారు.



జవహర్‌నగర్ జీసస్ ఆర్మీ మినిస్ట్రీస్‌లో క్రిస్మస్ వేడుకలు

ఘట్‌కేసర్: యేసు క్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకొని మండలంలో క్రిస్మస్ వేడుకల సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిల్లో క్రైస్తవ భక్తి గీతాలు, నృత్య ప్రదర్శనలు, కొవ్వొత్తుల వెలుగుల మధ్యన క్రిస్మస్ వేడుకలను జరుపుకున్నారు. చౌదరిగూడ, అవవల వవ షాపూకొండాపూర్ తదితర చర్చిల్లో వేకువజాము నుంచే భక్తులు ప్రార్థనలు చేశారు.



క్రిస్మస్ సందర్భంగా చర్చ్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

మేడ్చల్ రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీతో పాటు మండలంలోని గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. మున్సిపాలిటీ పరిధిలోని బాసిరేగడి,జ్ఞానాపూర్‌లో, గ్రామాల్లో క్రైస్తవులు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని చర్చిలో సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. జవహర్‌నగర్ జీసస్ ఆర్మీ మినిస్ట్రీస్‌లో పాస్టర్ ప్రభుదాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి.



ఎల్లంపేట్‌లో..



గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో...

వాజ్‌పేయికి బీజేపీ నేతల నివాళి





మేడ్చల్: దివగంత ప్రధాని భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతిని బీజేపీ నాయకులు సోమవారం మేడ్చల్‌లో నిర్వహించారు. వాజ్‌పేయి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

కీసర: కీసర మండల కేంద్రంలో సోమవారం బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కోల బాల్‌రాజ్ యాదవ్ ఆధ్వర్యంలో వాజ్‌పేయ్ చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్రనేత సింగిరెడ్డి వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



అల్వాల్: మల్కాజిగిరి డివిజన్‌లోని పార్టీలకు అతీతంగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. వెంకటాపురం డివిజన్ పరిధిలోని బురాని కాలనీలో కమ్యూనిటీకి అవసరమయ్యే వంటశాల గది నిర్మాణ పనులను మాజీ హోం మంత్రి మహమూద్‌అలి, కార్పొరేటర్ సబితకిషోర్‌తో కలిసి ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రణాళికబద్ధంగా కృషి చేస్తానన్నారు. బురాని కమ్యూనిటీ సభ్యులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గంగపుత్ర ప్రభుత్వ ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక

రామంతాపూర్ : తెలంగాణ గంగపుత్రుల ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రామంతాపూర్‌కు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ రచ్చ రఘు, ప్రధాన కార్యదర్శిగా మాడవేడి వినోద్ కుమార్‌తో పాటు కార్యవర్గ సభ్యులుగా డాక్టర్ ఆలయ శ్రీనివాసులు పాక వెంకట్ రాజన్న రాజ్యలక్ష్మీ నిరూపమ శ్రీపతి ఎన్నికయ్యారు. సోమవారం నిర్వహించిన గంగపుత్ర రాష్ట్ర ఉద్యోగుల సంఘం సమావేశంలో వీరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కేటీఆర్‌ను కలిసిన నాయకులు



మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీ కి చెందిన బీఆర్ఎస్ నాయకులు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిశారు. మహేశ్వరం ఎమ్మెల్యే సబితతో కలిసి నాయకులు కేటీఆర్ ను కలిశారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో నవాజ్‌రెడ్డి,రవిందర్,విక్రంరెడ్డి, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత



కీసర: దాయరలో నివాసం ఉంటున్న నిరుపేద కుటుంబానికి చెందిన ఎల్లమ్మకు సొంత ఇంటినిర్మాణం కోసం రూ 10 వేల ఆర్థికసాయాన్ని సోమవారం నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుట్ల చంద్రారెడ్డి ఇచ్చారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ పేదలను ఆదుకునేందుకు తాను ఎల్లప్పుడు ముందంజలో ఉంటానన్నారు

సందడిగా పాఠశాల వార్షికోత్సవం



మేడ్చల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని డీఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర జీఎస్టీ, కస్టమ్స్ ముఖ్య కమిషనర్ సందీప్‌ప్రకాష్ హాజరయ్యారు. స్కూల్ ఫౌండర్ చైర్మన్ దయానంద్ అగర్వాల్, డైరక్టర్లు అంజికుమార్ అగర్వాల్, సంజయ్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు ప్రారంభం



మేడ్చల్ రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సాయిగీత ఆశ్రమంలో వారం రోజుల పాటు నిర్వహించనున్న ప్రత్యేక పూజలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఆశ్రమ ప్రాంగణంలో సోమవారం రుద్ర హోమం నిర్వహించారు. పలు ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున హోమంలో పాల్గొన్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



జవహర్‌నగర్: జవహర్‌నగర్‌కు చెందిన కళాశాల విద్యార్థిని కె.హరితయాదవ్ సోమవారం సంగారెడ్డిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో పాల్గొని తృతీయస్థానం సాధించి కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా కరాటే మాస్టర్ రవి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు.

తప్పిపోయిన బాలుడిని అప్పగించిన పోలీసులు



మేడ్చల్ రూరల్: ఆడుకునేందుకు బయటికి వెళ్లిన బాలుడు తప్పిపోగా గంటల వ్యవధిలోనే మేడ్చల్ పోలీసులు కుటుంబీకులకు అప్పగించారు. ఎల్లంపేట్ గ్రామానికి చెందిన నాలుగేళ్ల బాలుడు అదృశ్యమవగా రేకులబావి వద్ద బాలుడిని గుర్తించిన మైసిరెడ్డిపల్లి ఉపసర్పంచ్ పాండు రంగం బాలుడిని మేడ్చల్ పోలీసులకు అప్పగించాడు. ఎస్ఐ లావణ్య బాలుడి కుటుంబికుల వివరాలు తెలుసుకుని బాలుడిని తల్లి కరుణకు అప్పగించారు.

ఆలయంలో చోరీ



సీసీ టీవీలో రికార్డయిన దృశ్యం

శామీర్‌పేట్: శామీర్‌పేట ఎల్లమ్మ దేవాలయంలో చోరీ జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు, శామీర్‌పేట పోలీసులు తెలిపిన మేరకు.. శామీర్‌పేట గ్రామంలోని ఎల్లమ్మ తల్లి ఆలయం గర్భగుడి తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించిన ఆలయ కమిటీ సభ్యులు చోరీ జరిగిందని పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూం టీం ఆధారాలు సేకరించారు. అమ్మవారికి అలంకరించిన రూ. 5 లక్షల విలువ గల బంగారు, వెండి ఆభరణాలు అపహరణకు గురయ్యాయని ఆలయ కమిటీ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీ చేస్తున్న దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డ్ అయ్యాయి.

వేర్వేరు చోట్ల ముగ్గురి అదృశ్యం

వేర్వేరు చోట్ల ముగ్గురు అదృశ్యమయ్యారు.మేడ్చల్‌లో ఇద్దరు, జవహర్ నగర్‌లో ఒకరు అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు.

మేడ్చల్‌లో వృద్ధుడు

మేడ్చల్ రూరల్: కిరాణ షాపునకు వెళ్లి వస్తానని ఇంటి నుండి వెళ్లిన వృద్ధుడు అదృశ్యమైన సంఘటన మేడ్చల్ పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్ఐ నవీన్ రెడ్డి తెలిపిన మేరకు.. మేడ్చల్ పట్టణంలోని కేఎల్ఆర్ వెంచర్‌లో నివాసం ఉండే అరెల్లి కొమురయ్య(60) నివాసముంటున్నాడు. సోమవారం ఉదయం కిరాణా దుకాణానికి వెళ్లి వస్తానని ఇంటి వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో కుటుంబీకులు మేడ్చల్ పోలీసులను ఆశ్రయించారు.

◆ ఇంటి నుండి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మురళీధర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రాజబొల్లారం తండా గ్రామానికి చెందిన మాలోత్ కూన(32)గత కొంత కాలంగా మతి స్థిమిత్తంలేదు. ఈ నెల 22న సాయంత్రం ఇంట్లో చెప్పకుండా బయటికి వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబీకులు చుట్టపక్కల, బంధువుల ఇళ్లలో ఆచూకీ కోసం వెతికినా లభ్యం కాకపోవడంతో మేడ్చల్ పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జవహర్‌నగర్‌లో యువతి

జవహర్‌నగర్: యువతి అదృశ్యమైన సంఘటన జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. జవహర్ నగర్ మార్కెట్‌లైన్‌లో సాధుల సురేష్, తిరుపతమ్మలు కుమారుడు, కుమార్తెతో కలిసి నివసిస్తున్నారు. కుమార్తె సాధుల తులసి (18) ఓ సూపర్‌మార్కెట్‌లో పనిచేస్తుంది. ఈ నెల 24వ తేదీన పనికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. తులసి పనిచేసే చోట వెళ్లి వివరాలు అడగగా తులసి గత మూడు రోజుల నుండి పనికి రావడంలేదని తెలిపారు. దీంతో ఆమె ఆచూకీ కోసం తెలిసిన చోటల్లా వెతికినా లభించలేదు. అయితే సోమవారం మధ్యాహ్నం తులసి ఫోన్ చేసి నా కోసం వెతకవద్దు, నేను క్షేమంగా ఉన్నానని చెప్పి ఫోన్ కట్ చేసింది. తిరిగి ఆమెకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ చేసుకుంది. ఈ మేరకు కుటుంబసభ్యులు జవహర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

శ్మశాన వాటిక అభివృద్ధికి కృషి



అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్‌లోని సాయిరెడ్డి కాలనీలో ఉన్న హిందూ స్మశానవాటిను స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి సోమవారం సందర్శించారు. శ్మశాన వాటికలో మొత్తం చెత్త, నిరుపయోగంగా పదార్థాలను డంప్ చేయడం వల్ల చుట్టు పక్కల ఉన్న 15 కాలనీ వాసులు దుర్గంధ భరితమైన వాసన, దోమలు చేరడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు వెంటనే ఫోన్‌లో మాట్లాడి స్మశాన వాటికలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు డోలి రమేష్, పరమేష్, పవన్‌కుమార్, సతీష్, నాగేందర్, జానకీరామ్ తదితరులు ఉన్నారు.